## రైతులను ముంచిన చరిత్ర

# బీజేపీ, కాంగ్రెస్‌దే

- చక్కర ఫ్యాక్టరీని కొనుగోలు చేసింది, మూసివేసింది బీజేపీ వాళ్లే
- పసుపు మద్దతు ధర లేకుండా చేసిన పాపం కుడా వారిదే
- సీఎం కేసీఆర్ పాలనలో పండుగలా వ్యవసాయం
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్

జగిత్యాల, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : 'డెబ్బై ఐదేండ్ల స్వతంత్ర భారతంలో రైతులను ముంచిన చరిత్ర బీజేపీ, కాంగ్రెస్‌లదే' అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పసుపు బోర్డు తెచ్చామని, త్వరలోనే ముత్యంపేట చెక్కర ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ, నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నాయకుడు ధర్మపురి అర్వింద్ ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పసుపుబోర్డు తీసుకువస్తామని, రైతులకు బాండ్ పేపర్ రాసి ఇచ్చి ఐదేండ్ల తర్వాత, మొక్కుబడిగా పసుపు బోర్డు ప్రకటించారన్నారు. ఐదేండ్ల కాలంలో ఏనాడూ పసుపు బోర్డు గురించి పట్టించుకోకుండా, స్పైసీబోర్డు తెచ్చామని, అన్నం అడిగితే బిర్యానీతెచ్చామని, పసుపుబోర్డుతో పనిలేదంటూ ప్రకటనలు చేసిన విషయం మరిచిపోయారా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపించడం, మరో నాలుగైదు నెలల్లో కేంద్ర ఎన్నికలు రానున్న నేపథ్యంలో రైతులను మభ్యపెట్టేందుకు ప్రధాని మోడీ నోటితో పసుపుబోర్డును ప్రకటింపజేశారన్నారు. పసుపుబోర్డు ప్రకటన వల్ల జగిత్యాల జిల్లా రైతాంగానికి ఒరిగే ప్రయోజనం ఏం లేదన్నారు. ఒకప్పుడు పసుపు పంట పండించే రైతులు లాభాలు సాధించేవారని, పసుపు క్వింటాల్ ధర, తులం బంగారం ధరతో సమానంగా ఉండేదన్నారు. కేంద్ర ప్రభుత్వాల పట్టింపు లేని తనం, మద్దతు ధర నిర్ధారణ లేకపోవడం పసుపు రైతులకు శాపంగా మారిపోయిందన్నారు. ప్రస్తుతం పసుపు ధరకు మార్కెట్‌లో ₹11 వేల ధర సైతం సరిగా పలకడం లేదన్నారు. పసుపు పంటకు మద్దతుధర లేకపోవడంతో జిల్లాలో క్రమంగా రైతులు పసుపు పంటను వీడి ఇతర పంటలు పండించడంలో నిమగ్నమయ్యారన్నారు. జగిత్యాల జిల్లాలో ఐదారేండ్ల క్రితం 30వేల ఎకరాల్లో పసుపు సాగయ్యేదని, ఇప్పుడు కేవలం 13వేల ఎకరాల్లో మాత్రమే సాగవుతున్నదన్నారు. సేద్య విస్తీర్ణంలో దాదాపు 60 శాతం తగ్గుదలకు కేంద్ర ప్రభుత్వం పసుపుబోర్డును ప్రకటించకపోవడం, పంటకు మద్దతు ధరను కల్పించకపోవడం కాదా..? అని ప్రశ్నించారు. పసుపు బోర్డు ప్రకటన పేరుతో సంబురాలు జరుపుకుంటూ, ముత్యంపేట షుగర్‌ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ ప్రకటనలు చేయడం వింతగా ఉందన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని విక్రయించింది, అటుపైన దాన్ని మూసివేసింది, ఇప్పుడు తెరుస్తామంటూ ప్రకటనలు చేస్తున్నది బీజేపీయే కావడం విచిత్రంగా ఉందన్నారు. 2000 సంవత్సరంలో రాష్ట్రంలో బీజేపీ మద్దతుతో ఉన్న టీడీపీ అధికారంలో ఉండగా, కేంద్రంలో టీడీపీ మద్దతుతో బీజేపీ అధికారంలో ఉందని, ఆ సమయంలో షుగర్ ఫ్యాక్టరీని టీడీపీ ప్రభుత్వం విక్రయించిందన్నారు. షుగర్ ఫ్యాక్టరీని విక్రయించే విషయంలో టీడీపీతో కలిసి ఉన్న బీజేపీకి భాగస్వామ్యం ఉందన్నారు. టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలు షుగర్ ఫ్యాక్టరిని విక్రయిస్తే దాన్ని బీజేపీ ఎంపీ అయిన గోకరాజు గంగరాజు కొనుగోలు చేశారన్నారు. ఫ్యాక్టరీని విక్రయించింది బీజేపీ ప్రభుత్వమయితే.. కొనుగోలు చేసింది ఆ పార్టీకి ఎంపీనే అని వివరించారు. ఇప్పుడు మూతపడి ఉన్న షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తామని చెబుతున్నది బీజేపీయే కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీల చేతగాని తనం వల్ల జిల్లాలో రైతులు చెరుకు, పసుపు రైతులు నష్టపోయారని, ఇతర పంటలకు మారిపోయారన్నారు. తెలంగాణ సాధన తర్వాత సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యల వల్ల సాగురంగానికి, రైతాంగానికి లబ్ధి కలిగిందన్నారు. సీఎం కేసీఆర్ చర్యల వల్ల రాష్ట్రంలో, జగిత్యాల జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. రాష్టం ఏర్పడినప్పుడు 60 లక్షలుగా ఉన్న సాగు విస్తీర్ణం నేడు 1.20 కోట్ల ఎకరాలకు పెరిగిందన్నారు. జిల్లాలోనూ అదే రీతిలో పెరిగిందన్నారు. రైతుబంధు, రైతుభీమా, రుణమాఫీ, ఉచిత విద్యుత్ వల్లనే ఇది సాధ్యపడిన విషయం వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఇవ్వనంత గొప్పగా రుణమాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికీ తెలంగాణ రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూనే ఉందని మండిపడ్డారు. రాష్ట్రంలో పండిన బియ్యాన్ని ఎందుకు భారత ఆహార సంస్థ తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. పంటలపై 20 శాతం సెస్ పెంచివేశారని, నూకల ఎగుమతులను నిలిపివేసి రాష్ట్ర రైతాంగాన్ని ఇబ్బందిపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఏపీ, పొటాషియం ధరలు పెంచి, వాటిపై జీఎస్టీలు పెంచడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, డీజిల్ ధర పెంపుతో ట్రాక్టర్లు వినియోగించలేని దుస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. రైతాంగాన్ని ఆది నుంచి బీజేపీ, కాంగ్రెస్ ముంచాయన్నారు. పసుపు రైతులను దగా చేసిన బీజేపీ, ఇప్పుడు షుగర్ ఫ్యాక్టరీ పేరిట కొత్త నాటకానికి తెరలేపిందని చురకలంటించారు. రైతులు మంచివారే కానీ, అమాయకులు కాదని, వారికి ఎవరు మేలు చేస్తున్నారు..? ఎవరు నష్టం చేస్తున్నారన్న విషయంలో స్పష్టత ఉందని, వారే బుద్ధి చెబుతారన్నారు. ఇప్పటికైనా బీజేపీ అబద్ధపు హామీలు ఇవ్వకుండా రైతులకు మేలు చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొలుగూరి దామోదర్‌రావు, దావ సురేష్, సింగిల్ విండో చైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, నాయకులు బాలముకుందం, గట్టు సతీశ్ పాల్గొన్నారు.

# అర్వింద్ ఓ మూర్ఖుడు



కోరుట్ల పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- వృద్ధులను అగౌరవపరుస్తవా..
- దమ్ముంటే నాపై ఆరోపణలు రుజువు చెయ్
- నిజామాబాద్ ఎంపీపై ఎమ్మెల్యే కల్వకుంట్ల ఫైర్

కోరుట్ల, అక్టోబర్ 14: 'నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఓ మూర్ఖుడు. అతనికి నీతి, నిజాయితీ లేదు. పెద్దలంటే అసలే గౌరవం లేదు. అతని తండ్రినే పదవుల కోసం వేధించిన కుసంస్కారి' అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. కోరుట్ల పట్టణంలోని కట్కం సంగయ్య ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ లాంటి పెద్ద మనిషిని పట్టుకొని ఇష్టారీతిగా తూలనాడుతూ సభ్య సమాజానికి తలవంపులు తెస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తనను ముసలోడని సంబోధించి వృద్ధులందరినీ అగౌరవ పరిచాడన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో ఎంతో మంది వృద్ధులు ఉన్నారని, అందరినీ అవమానించేలా వాఖ్యలు చేసిన ఎంపీ బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఉద్యమించిన 800 మంది రైతులను పొట్టన పెట్టుకున్న బీజేపీ సర్కారుకు రైతన్నల గోస తగులుతుందన్నారు. సీఎం కేసీఆర్ రైతుల పాలిట దేవుడని, అడుగకముందే రైతులకు రైతుభీమా, రైతు బంధు, 24 గంటల ఉచితంగా సాగునీటికి కరెంట్ ఇస్తున్నాడని, ఇన్ని పనులు చేసినందునే రైతుల మాకు దీవేనలు ఇస్తున్నారని చెప్పారు. 'అర్వింద్‌ను చూస్తే చిన్న పిల్లలు జడుసుకుంటరు. పెద్దలు భయపడుతున్నరు' అని ఎద్దేవా చేశారు. ఈ నాలుగున్నరేళ్లలో ఎంపీగా కోరుట్ల నియోజకవర్గానికి అర్వింద్ చేసిన ఒక్క మంచి గురించి చెప్పాలని డిమాండ్ చేశారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడొద్దని, బీసీ బంధు, రైతు బంధు, దళిత బంధు పథకాల్లో లబ్ధిదారుల నుంచి పర్సంటేజీలు తీసుకున్నట్లు నిరూపిస్తే తాను కోరుట్ల నుంచి ప్రజలకు కనిపించకుండా వెళ్లి పోతానన్నారు. ఆరోపణలు చేసే ముందు రుజువులు చూపాలని, కోరుట్ల అంబేద్కర్ విగ్రహం సాక్షిగా తప్పు చేస్తే ముక్కు భూమికి రాస్తానని ఛాలెంజ్ విసిరారు. తమకు దూషించడం పెద్ద పని కాదని, సంస్కారం అడ్డువస్తుందన్నారు. కోరుట్లలో తాము చేసిన అభివృద్ధే తమను గెలిపిస్తుందన్నారు. 'కోరుట్లలో నువ్వు పోటీలో నిలిస్తే భయపడేవారు ఎవరూ లేరని, మా జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కోరుట్ల ప్రజలను మాటల గారడీతో బురిడి కొట్టాలని చూస్తే తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు బాధాకరమన్నారు. 'ఓటుకు నోటు కేసులో అడ్డంగా బుక్కైన నువ్వు పెద్ద మనిషిని అనరాని మాటలు అనడం కుసంస్కారానికి నిదర్శనం' అని మండిపడ్డారు. దొంగల చేతుల్లోకి రాజ్యాధికారం పోతే గోస పడుతామని, అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, జిల్లా సర్పంచ్‌ల ఫోరం గౌరవాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

# జగన్మాతా.. నమో నమః

- నేటి నుంచి ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు
- ప్రత్యేక అలంకారాల్లో అమ్మవారి దర్శనం

వేములవాడ టౌన్ , అక్టోబర్ 14 : ఈ నెల 15వ తేదీ నుంచి దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో అమ్మవారు తొమ్మిది రోజులు ఒక్కో అవతారంగా భక్తులకు దర్శనమిస్తారు. ఆదివారం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఈ నెల 23వ తేదీ సోమవారం ఆశ్వీయుజ శుద్ధ దశమి వరకు శరన్నవరాత్రోత్సవాలు వైభవోపేతంగా కొనసాగనున్నాయి. అమ్మవారి మూలవిరాట్‌కు జరిగే విశేష అలంకరణే ఈ ఉత్సవాల ప్రత్యేకత. తొలిరోజు ఉత్సవాలు ప్రారంభించే ముందు గణపతిపూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, మహాకలశస్థాపన, అంకురారోహణ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఉంటాయి. విశేష పూజల్లో భాగంగా ప్రతిరోజూ నవావరణ అర్చనలు, చండీ హోమాలు, అవాహిత దేవతాహోమాలు, అమ్మవారి సేవ, మహానివేదనలు, సువాసిన పూజలు నిర్వహిస్తారు. అమ్మవారు శైలపుత్రి, బ్రహ్మాచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదా మహాలక్ష్మి (శ్రీరాజరాజేశ్వరీదేవి) అలంకారాలతో తొమ్మిది రోజుల పాటు అమ్మవారు విశేషపూజలు అందుకుంటారు.

**సిద్ధమవుతున్న మండపాలు**

దేవీ నవరాత్రుల సందర్భంగా పలు ప్రాంతాల్లో దుర్గాదేవి ప్రతిమలు ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు పలు యువజన, భక్త సంఘాలు దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం ఉత్సవ శోభను సంతరించుకుంది. రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణతో శోభాయమానంగా మారింది. స్వామి, అమ్మవార్ల సన్నిధిలో శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.



కాళరాత్రి అలంకారము



బైక్ యాత్ర చేస్తున్న మహేశ్‌ను జగిత్యాలలో అభినందిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డా. ఎం సంజయ్‌కుమార్

## సారే కావాలి.. కారే రావాలి..

- రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుడి జన చైతన్య బైక్ యాత్ర
- జగిత్యాలలో స్వాగతం పలికిన ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 14: 'సారే కావాలి.. కారే రావాలంటూ ఓ దివ్యాంగుడు జన చైతన్య పేరుతో నిర్వహిస్తున్న బైక్ యాత్ర, జగిత్యాలకు చేరుకోగా, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ స్వాగతం పలికారు. హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగుడు మహేశ్.. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల మీదుగా బైక్ యాత్ర నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం జగిత్యాలకు చేరుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించి అధికారంలోకి రావాలనే కాంక్షతో హైదరాబాద్ నుంచి బైక్ యాత్రను ప్రారంభించానని తెలిపాడు. కాగా, మహేశ్ యాత్రపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేసి అభినందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల జిల్లా ఉపాధ్యక్షుడు అష్ఫర్‌ఖాన్, ఆదిల్, శేఖర్, సమిండ్ల శ్రీనివాస్, గిరి, ఆసీఫ్ పాల్గొన్నారు.